

శుక్రవారం పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖనిలో కేసీఆర్ రోడ్‌షోకు తరలివచ్చిన అశేష జనవాహిని

# కదంతొక్కిన ఖని.. జనం ప్రతిధ్వని

- కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- జనసంద్రమైన గోదావరిఖని చౌరస్తా
- నవ్వుతూ.. నవ్విస్తూ ప్రశ్నలు సంధించిన జననేత
- కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రశ్నిస్తే.. రాలేదన్న జనాలు
- సింగరేణికి ప్రమాదమున్నదని జాగృతపర్చిన మాజీ సీఎం
- దిక్కులు పిక్కటిల్లేలా నినదించిన శ్రేణులు, అభిమానులు

కరీంనగర్, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి, కేప్రకాశ్‌రావు): కార్మిక క్షేత్రం కదం తొక్కింది.. తరలివచ్చిన ప్రజలు, కార్మిక లోకంతో గోదావరిఖని చౌరస్తా జనసంద్రమైంది.. ఉద్యమ సారథి, గులాబీ దళపతి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వస్వాగతం లభించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖనిలో శుక్రవారం కేసీఆర్ రోడ్‌షోకు అశేష జనవాహిని తరలివచ్చింది. ఎన్నికల కమిషన్ 48 గంటలపాటు ప్రచారంపై నిషేధం విధించిన అనంతరం తొలిసారిగా జరిగిన రోడ్‌షో గ్రాండ్ సక్సెస్ అయింది. కేసీఆర్ గోదావరిఖని పట్టణంలోకి రాగానే.. ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన రోడ్డుషో.. గోదావరిఖని చౌరస్తా వరకు కొనసాగింది. ఇసుకపోస్తే రాలనంత జనంతోపాటు అడుగడుగునా సంప్రదాయ నృత్యాల మధ్య కేసీఆర్ రోడ్‌షో కొనసాగింది. దారి పొడవునా బస్సులో నుంచి కేసీఆర్ అభివాదం తెలుపుగా, ప్రజలు ఆయనను చూసేందుకు అమితాసక్తి చూపారు. ప్రధానంగా మహిళలు దారి పొడవునా కేసీఆర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కేసీఆర్ జిందాబాద్, సీఎం జిందాబాద్.. అంటూ పలుసార్లు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పలుమార్లు కేసీఆర్ వారించినా.. ప్రజలు మాత్రం 'సీఎం జిందాబాద్' అన్న నినాదాలను మాత్రం ఆపలేదు. చౌరస్తాకు చేరుకున్న అనంతరం బస్సు పైకి కేసీఆర్ రాగానే.. గోదావరిఖని మొత్తం ధ్వనించేలా ప్రజలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.. 'మా సీఎం మీరే' అంటూ.. చేసిన నినాదాలతో నలుదిక్కులు పిక్కటిల్లాయి. కేసీఆర్ రోడ్డు షో సందర్భంగా గోదావరిఖని మొత్తం గులాబీమయం అయింది. అనంతరం 28 నిముషాలపాటు ఉద్వేగభరితంగా కేసీఆర్ ప్రసంగించగా.. ప్రజలు ఎంతో ఆసక్తిగా విన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై పలు ప్రశ్నలు సంధించారు. నవ్వుతూ, నవ్విస్తూ ప్రశ్నలు అడిగిన తీరు ప్రజలను ఆకట్టుకున్నది.

### ప్రజల నుంచి విశేష స్పందన

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ఎండగట్టినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒక్కొక్కదాని పేరు చెప్తూ వచ్చిందా? అని అడిగినప్పుడు జనం నుంచి 'రాలేదు.. రాలేదు' అంటూ సమాధానం వచ్చింది. ప్రధానంగా తులం బంగారం వచ్చిందా? అని అడిగిన ప్రశ్నకు జనం నుంచి 'రాలేదు.. రాలేదు' అంటూ సమాధానం వచ్చింది.. ఏ రెండు తులాలు వచ్చిదంట కదా.. అని నవ్వుతూ జోక్ వేయగా.. 'మళ్లీ రాలేదు.. రాలేదు' అంటూ చేతులూపుతూ చెప్పారు. ఇక్కడ మోసం జరిగిందా? అంటే అవును అంటూ అందరూ తలలూపుతూ సమాధానం చెప్పారు. అలాగే నాలుగు వేల పింఛన్ వచ్చిందా? అని కేసీఆర్ అడిగితే.. రాలేదంటూ మార్మోగేలా ప్రజల నుంచి సమాధానం వచ్చింది. ఇదే సమయంలో 'మీకు ఆరువేలు వచ్చిదంట కదా' అని కేసీఆర్ నవ్వుతూ ప్రశ్నించగా, అంతే స్పీడ్‌తో 'ఏమీ రాలేదు' అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. మహిళలకు రూ.2500 వచ్చాయా? అంటూ కేసీఆర్ ప్రశ్నించగా.. ఏదీ రాలేదంటూ గట్టిగా చెప్పారు. రైతు కూలీలకు రూ.15 వేలు వచ్చినయా? అందరికీ రైతు బీమా వచ్చిందా? అంటూ ప్రశ్నించగా.. ఏదీ లేదంటూ చేతులూపుతూ ప్రజలు సమాధానం ఇచ్చారు. దళితబంధు వస్తుందా? అన్న ప్రశ్నకు.. రావడం లేదంటూ ప్రజలు సమాధానం చెప్పారు.

### నినదించిన సింగరేణి కార్మికులు

'సింగరేణిని నిండా ముంచిందే కాంగ్రెస్ పార్టీ.. కేంద్రం వద్ద అప్పులు చేసి.. 49 శాతం వాటా కట్టబెట్టింది ఎవరు?' అని అడిగితే... కాంగ్రెస్, కాంగ్రెస్ అంటూ కార్మికులు నినందించారు. సింగరేణిలో 19 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చింది ఎవరు? అని అడిగితే.. అది మీరే మీరే అంటూ కేసీఆర్ వైపు వేలు చూపిస్తూ ప్రజలు సమాధానం చెప్పారు. మన సింగరేణి కొంగుబంగారం.. దానికి అన్యాయం జరిగితే మనమంతా ఒక్కటై పోరాడాలి అంటూ కేసీఆర్ చెప్పగా.. పిడికిళ్లెత్తి కేసీఆర్‌కు సంఘీభావం ప్రకటించారు. మీ బిడ్డ సింగరేణి కార్మికుడు... మృదు స్వభావి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేయగా.. 'కొప్పుల జిందాబాద్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సింగరేణిపై సీపీఐ, సీపీఎం వైఖరులు చెప్పాలని కేసీఆర్ సభలో నిలదీసినప్పుడు జనం నుంచి విశేష స్పందన కానవచ్చింది.

# వామపక్షాలకు కేసీఆర్ సవాల్

- మీరు కార్మికుల వైపా? కాంగ్రెస్ వైపా?
- అదానీతో మిలాఖత్‌పై సీఎంతో జవాబు చెప్పించండి
- నేటిలోగా నా ప్రశ్నకు జవాబివ్వండి: కేసీఆర్

గోదావరిఖని, మే 3: సింగరేణి గనుల సాక్షిగా, నల్లబంగారాలైన కార్మికుల సాక్షిగా వామపక్ష పార్టీలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూటి సవాల్ విసిరారు. 'మీరు కాంగ్రెస్ వైపా? కార్మికుల వైపా?' అని నిలదీశారు. 'ఇప్పుడు సింగరేణిని ముంచటానికి బీజేపీ, కాంగ్రెస్ ఏకం అవుతున్నాయి. అధిక ధరల ఆస్ట్రేలియా బొగ్గు తెచ్చి.. తెలంగాణకు అంటగట్టి, సింగరేణిని సర్వనాశనం చేయాలనుకుంటున్న మోదీ దోస్త్ అదానీకి రేవంత్‌రెడ్డి రెడ్ కార్పెట్ పరుస్తున్నరు. సింగరేణిని నిండా ముంచాలని చూస్తున్నరు. దీనిపై వామపక్ష నేతలు తమ వైఖరి చెప్పాలి. ఒకప్పుడు సింగరేణిలో కార్మికుల కుటుంబాలకు ఆదరువుగా ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను పోగొట్టిందే కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం. ఆ ఉద్యోగాలను మేం పునరుద్ధరించాం. 19 వేల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చినం. సిమ్స్ అనే పేరు మీద సింగరేణి మెడికల్ కాలేజీ పెట్టుకున్నం. ఆ కాలేజీలో 5 శాతం కార్మికుల పిల్లలకే సీట్లు వచ్చేట్టు చేసినం. సింగరేణి అప్పుల్లో కూరుకుపోతే కేంద్రానికి వాటాను అమ్మేసిందే కాంగ్రెస్. దాన్ని నష్టాల్లో ముంచిందే కాంగ్రెస్. అటువంటిది సింగరేణిని లాభాల్లోకి తెచ్చి కార్మికులకు పంచినం. కాంగ్రెస్ దాన్ని ముంచితే, బీఆర్‌ఎస్ కాపాడింది. మరి వామపక్ష నాయకులు ఇప్పుడేం చెప్తరు? సింగరేణికి శాపం లాంటి అదానీతో ఎందుకు రాసుకుపూసుకు తిరుగుతున్నవ్? అని కాంగ్రెస్‌ను వాళ్లు నిలదీయాలి' అని కేసీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో వెంటనే సమాధానం చెప్పించాలని డిమాండ్ చేశారు.

### నేడు మంచిర్యాలలో కేసీఆర్ రోడ్‌షో

కేసీఆర్ బస్సుయాత్ర శనివారం మంచిర్యాల జిల్లాకు చేరుకోనున్నది. ముందు ప్రకటించిన విధంగానే మంచిర్యాలలో శనివారం సాయంత్రం భారీ రోడ్‌షో ఉంటుందని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

# బీఆర్‌ఎస్ ఫిర్యాదును పరిష్కరించండి

## ఫోన్ల ట్యాపింగ్‌పై కేంద్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు ప్రచారం జరగకుండా చూడాలన్న ఫిర్యాదును పరిష్కరించాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసేలా గూగుల్, యూట్యూబ్, ఇతర షోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని నిరోధించడంలో కేంద్రం విఫలమైందంటూ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. ఫోన్ల ట్యాపింగ్ అంశంపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాజనిత కథనాలు 2021లో కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని, బీఆర్‌ఎస్ నేతలపై నిరాధార ఆరోపణలు రాకుండా నిరోధించాల్సిన అవసరం ఉన్నదని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బీ మయూర్‌రెడ్డి వివరించారు. ఈ విషయమై గత నెల 25న కేంద్రానికి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సమాచారాన్ని గూగుల్, యూట్యూబ్ నుంచి తొలగించాలని, లేదంటే ఆ సమాచారం ఇతరులకు అందుబాటులో లేకుండా నియంత్రించేలా ఆయా సంస్థలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీంతో బీఆర్‌ఎస్ వినతిపత్రంపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

# బీఆర్‌ఎస్ ప్రచారంలో అపశ్రుతి

- డీజే వాహనం దూసుకొచ్చి ఒకరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

పీర్జాదిగూడ, మే 3: బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న డీజే వాహనం బ్రేకులు ఫెయిలై ర్యాలీలో ఉన్న జనాలపైకి రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మేడిపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో బోడుప్పల్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచారంలో పాటల కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనం బ్రేకులు ఫెయిలై అదుపుతప్పి ర్యాలీపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఉప్పల్ కళ్యాణ్‌పురికి చెందిన శ్రవణ్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను హుటాహుటిన దవాఖానకు తరలించారు.



### ఇసుక పోసినా రాలనంత..

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్‌కు ప్రజలు ఇసుక పోసినా రాలనంతగా పోటెత్తారు. కేవలం ఒక్క మండల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరు కాగా సుమారు 10వేల మందికి పైగా తరలివచ్చి గులాబీ పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. – ఇల్లంతకుంట

### సీఎం వచ్చినా.. కానరాని స్పందన

ఇదే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి వచ్చినా ప్రజల్లో స్పందన కరువైంది. 'పది నిమిషాల్లో సీఎం వస్తున్నారు.. అంతా కూర్చోవాలి' అని వేదికపై నుంచి నేతలు చేసిన విజ్ఞప్తులను కూడా పట్టించుకోకుండా వచ్చిన కార్యకర్తలు సైతం లేచి వెళ్లిపోవడం కనిపించింది. సుమారు 2వేల మంది కూడా లేకపోవడంతో రేవంత్ వచ్చే సమయానికి ఇక్కడి ఆరుగ్యాలరీల్లో నాలుగు పూర్తిగా ఖాళీ అయ్యాయి. రాత్రి 8.48 గంటలకు రేవంత్‌రెడ్డి చేరుకొని ప్రసంగిస్తుండగా 95శాతం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి.
– రాజన్న సిరిసిల్ల నమస్తే తెలంగాణ



# తుస్సుమన్న జనజాతర సభలు

- జనం లేక కాంగ్రెస్ మీటింగ్‌లు వెలవెల
- సీఎం మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు
- జగిత్యాల జిల్లా రాజారాంపల్లి, సిరిసిల్లలో సభలు ఫ్లాప్
- బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దే: సీఎం రేవంత్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మే 3 (నమస్తే తెలంగాణ)/ వెల్గటూర్: జనజాతర సభలు తుస్సుమన్నాయి. జనం లేక కాంగ్రెస్ సభలు వెలవెలబోయాయి. సీఎం సమయానికి రాకపోవటంతో జనం అసహనాన్ని వ్యక్తం చేశారు. మిట్టమధ్యాహ్నం మండుటెండల్లో సభలు ఏర్పాటు చేయగా, అనుకున్న సమయం కన్నా సీఎం ఆలస్యంగా వచ్చారు. దీంతో సభలకు వచ్చిన వాళ్లంతా ఇంటిదారి పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి, సిరిసిల్లలోని మొదటి బైపాస్‌రోడ్డులో ఉన్న మైదానంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లు అట్టర్‌ఫ్లాఫ్ అయ్యాయి. రాజారాంపల్లి సభకు సీఎం మధ్యాహ్నం 2.30 రావాల్సి ఉండగా, సాయంత్రం 6.30 గంటలకు వచ్చారు. అయితే, మధ్యాహ్నం 12 గంటలకే వచ్చిన జనాలు మీటింగ్ ఆలస్యం కావటంతో విసిగి వేసారి వెనుతిరిగి వెళ్లిపోయారు. సిరిసిల్లలో అయితే పది నిమిషాల్లో సీఎం వస్తున్నారని, కూర్చోవాలని నేతలు చెప్పినా.. జనం, కార్యకర్తలు వారి విజ్ఞప్తులను పట్టించుకోకపోవటం గమనార్హం. సభకు వచ్చిన జనంలో 95 శాతం వెళ్లిపోయారు. రాత్రి 8.48 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సభాస్థలికి చేరుకున్నారు. ఆయన ప్రసంగిస్తుండగా సభలో అన్నీ ఖాళీ కుర్చీలే కనిపించాయి. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న సిరిసిల్లలో పెద్దఎత్తున జన సమీకరించి సక్సెస్ చేద్దామనుకున్న నేతలు తీవ్రనిరాశ, నిస్పృహకు లోనయ్యారు.

### బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ రద్దుకే: సీఎం

బీజేపీకి వేసే ప్రతి ఓటు దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయడానికేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండు సభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 400 ఎంపీ సీట్ల కోసం మోదీ చూస్తున్నారని, అలా గెలిపిస్తే మోడీ అధికారంలోకి రాగానే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆరోపించారు. రాష్ర్టానికి మోదీ ఏమీ ఇవ్వలేదని గాడిద గుడ్డును సీఎం ప్రదర్శించారు. విభజన చట్టంలోని హామీలను బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదని, పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ఏర్పాటుపై మోదీ అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటించని బీజేపీకి ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు.

### ఎండపల్లి స్టేజీ వద్ద ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

రాజారాంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు వచ్చి తిరిగివెళ్తున్న వారిలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ధర్మపురి మండలంలోని జైనకు చెందిన నలుగురు తమ ఆటోలో వెళ్తుండగా, ఎండపల్లి స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో జైనకు చెందిన సుధీర్, సత్యానికి తీవ్ర గాయాలు కావటంతో జగిత్యాల దవాఖానకు తరలించారు.

# రేవంత్ రాజీనామాకు సిద్ధమా?

## ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తవా? చేయవా? • ఆరు గ్యారెంటీలు అమలు చేస్తవా? చేయవా? • సూటిగా చెప్పు.. డొంక తిరుగుడు మాటలొద్దు

- అమలు చేస్తే రాజీనామాకు సిద్ధం
- నువ్వు సిద్దిపేటకు వస్తే నేనే స్వాగతం చెప్తా
- శాలువా కప్పి రాజీనామా ఆమోదించుకుంటా
- లేకపోతే కొడంగల్ చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తవా?
- సీఎం రేవంత్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు ప్రతి సవాల్



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదిరులు

సిద్దిపేట/నల్లగొండ ప్రతినిధి, హుస్నాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 తర్వాత సిద్దిపేటకు వస్తా అన్నడు. ఆయన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నా. ఇవ్వాళ కూడా నా మాట మీద నిలబడుతున్న. వంద రోజుల్లో అమలుచేస్తామని బాండ్‌పేపర్ మీద రాసిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయండి. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయండి.నేనే స్వయంగా శాలువా కప్పుతా. సిద్దిపేటకు సీఎంను స్వయంగా నేనే స్వాగతిస్తా. నా రాజీనామాను ఆమోదించుకుంటా'..అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పంద్రాగస్టుకైనా ఆరు గ్యారెంటీలు,రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని స్పష్టంగా చెప్పాలి. దానికి నువ్వు (సీఎం రేవంత్‌రెడ్డి) సిద్ధమా? ఆరు గ్యారెంటీలు అమలు చేసి, రుణమాఫీని పంద్రాగస్టు లోపు చేస్తే నేనే స్వచ్ఛందంగా స్పీకర్ దగ్గరికి వెళ్లి స్పీకర్ ఫార్మాట్‌లో నా రాజీనామాను ఆమోదించుకోవటానికి సిద్ధం. మళ్లీ ఎన్నికల్లో పోటీచేయను. నువ్వు రాజీనామాకు సిద్ధమా? ఒకవేళ చేయకపోతే కొడంగల్ చౌరస్తాలో ముక్కునేలకు రాస్తవా?' అని ప్రశ్నించారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి తన రాజీనామాను పంపిస్తానని, రేవంత్ కూడా పంపాలని డిమాండ్ చేశారు. 'డొంక తిరుగుడు .. డొల్ల మాటలు వద్దు.. నేను చేసిన చాలెంజ్‌ను స్వీకరించాలని మళ్లీ అడుగుతున్నా. ఇప్పటిదాకా నా చాలెంజ్‌ను స్వీకరించలేదు.సొల్లు మాటలు మాట్లాడుతున్నారు. సంగారెడ్డిలో చాలెంజ్ చేసినప్పటి నుంచి నేను ఒకే స్టాండ్ మీద ఉన్నా. మీరు ఏ వీడియో క్లిప్పింగ్ చూసినా, పబ్లిక్ మీటింగ్ చూసినా ఇదే కనిపిస్తుంది. నీ లెక్క పదవుల కోసం పార్టీలు మార్చుడు, అబద్ధాలు ఆడటం, చిల్లర రాజకీయాలు చేయటం నాకు రాదు. విలువలతో కూడిన రాజకీయాలు చేయటమే నాకు అలవాటు' అని స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్యే పదవి కంటే ప్రజలకు మేలు జరగటమే సంతోషమని చెప్పారు.

### కాంగ్రెస్, బీజేపీ కొత్త నాటకం

కేసీఆర్ బస్సుయాత్ర సూపర్ హిట్ కావటంతో బీజేపీ, కాంగ్రెస్ కొత్త నాటకానికి తెర తీశాయని హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ లేకుండా చేయాలన్నదే ఈ రెండు పార్టీల కుట్ర అని విమర్శించారు.కాంగ్రెస్‌కు ఓటేస్తే హిందువుల ఆస్తులు ముస్లింలకు పంచుతారని ప్రధాని మోదీ, బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఇవి రెండు జరగవని స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, గుజరాత్‌కు పోటీ అంటూ రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెర తీశారని హరీశ్ అన్నారు. 'ఏనాడు జై తెలంగాణ అనలేదు, ఒక్కరోజూ అమరవీరుల స్థూపం వద్ద రెండు పూలు పెట్టలేదు. నువ్వు కూడా తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడుతావా?'అని రేవంత్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. రేవంత్ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని, కేసీఆర్ ఉండగా రిజర్వేషన్లు పోతాయా? ఇంత పెద్ద నాయకుడు ఉండగా, ఇంత పెద్ద భారత రాజ్యాంగం ఉండగా, రిజర్వేషన్లు మారితే ఆ ప్రభుత్వం ఉంటదా? అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు రాజనర్సు, రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సాయిరాం, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేవంత్ హుందాగా మాట్లాడితే మంచిది

'రేవంత్‌రెడ్డి.. మీరు సీఎం హోదాలో ఉన్నారు. గౌరవంగా మాట్లాడితే, హుందాగా ఉంటే రాష్ర్టానికి మంచిది' అని హరీశ్‌రావు చురక అంటించారు. బీఆర్‌ఎస్‌పై బురద చల్లాలన్న పిచ్చి ప్రయత్నంతో రేవంత్ చేసిన అసందర్భ వ్యాఖ్యల వల్ల రాష్ర్టానికి పెట్టుబడులు రాకుండా పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైందని ఆరోపించారు. బిడ్డ పెండ్లి పెట్టుకున్నామని, భూమి అమ్ముదామంటే ఎవరూ కొనడానికి ముందుకు రావటం లేదని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయిపల్లికి చెందిన ఒక మహిళ తనతో గోడు వెళ్లబోసుకొన్నదని వెల్లడించారు.

### రేవంత్ లక్ష తులాల బంగారం బాకీ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష పెండ్లిళ్లు జరిగాయని, అంటే.. ఆడబిడ్డలకు రేవంత్ సర్కార్ లక్ష తులాల బంగారం బాకీ పడ్డదని మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని చండూరులో, నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలోని నల్లగొండలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి రోడ్‌షోల్లో హరీశ్‌రావు ప్రసంగించారు. అధికారం అహంకారంతోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టాలని అంటున్నారని మండిపడ్డారు. వాళ్ల అహంకారం దింపాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిపించాలని పిలుపునిచ్చారు. బాండ్‌పేపర్లకు, దేవుళ్లపై ఒట్లకు మోసపోదామా? అని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డి తన మంత్రి పదవి కోసం భువనగిరి ప్రజలను తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రోడ్‌షోల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, ప్రభాకర్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి, లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నేతలు పాల్వాయి స్రవంతి, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, మల్లికార్జున్‌రెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేసేందుకు బాబు, కాంగ్రెస్ కుట్ర

**హైదరాబాద్‌ను** ఉమ్మడి రాజధాని చేసేందుకు చంద్రబాబు, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇలా జరిగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జరగకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలు ఎక్కువ మంది పార్లమెంట్‌లో ఉండాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో శుక్రవారం జరిగిన రోడ్‌షోలో కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని, ఆయన పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని వెల్లడించారు. పల్లెలు, పట్టణాల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, ఈసారి బీఆర్‌ఎస్ ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి కాముకుడైన వినోద్ కుమార్‌ను గెలిపించాలని, కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణకు పూర్వవైభవం తేవాలని ప్రజలను కోరారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే గులాబీ జెండా అని, విధ్వంసం అంటే కాంగ్రెస్, బీజేపీ అని ఎద్దేవా చేశారు. కరీంనగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రోడ్‌షోలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.